# నేహాల



సాయిబ్రహ్మానందం గొర్తి

## చరిత్రకి బలైన స్వేచ్ఛ కథ

(గత సంచిక నుంచీ తరువాయి)

# 28

**ఆ రాత్రి నేహాలకి నిద్ర పట్టలేదు. ఎడతెరిపిలేని ఆలోచనలు.**

ఒక్కోసారి ఏం జరుగుతూందో కూడా తెలియడం లేదు. అన్నీ జరిగిపోతున్నాయి, తన ప్రమేయం ఏమాత్రం లేకుండా.

తను పెళ్ళి కాదంటే ఈ సుల్తానులు బ్రతకనివ్వరు. తనవరకూ భయంలేదు. కానీ అమ్మా,నాన్నలకి ఏం జరిగినా తను తట్టుకోలేదు. ఇదంతా మసూం వల్లే జరిగింది. అయినా అతనేం చేస్తాడు. దేవరాయల రాజ్యంలో ఉండడం కంటే ఈ గుల్బర్గాలో ఉండడమే క్షేమం అనుకోని ఉంటాడు. ఫిరోజ్‌షా ఇలా తన పెళ్ళి నిర్ణయిస్తాడని అతను మాత్రం ఊహించ గలడా?

దేవుడా! ఏవిటీ అగమ్యగోచరమయిన బ్రతుకు? ఆవేదన చెందుతూ రాత్రంతా గడిపింది. ఒక పక్క తల్లీ తండ్రిదీ అదే పరిస్థితి. వాళ్ళు పడుక్కున్నట్లుగా అనిపించలేదు నేహాలకి. అటూ ఇటూ ఒత్తిగిల్లడం గమనిస్తూనే ఉంది.

రేపు ఉదయం హసన్‌తో మాట్లాడాలని మసూంచేత చెప్పించింది. తనకి మిగిలిన మార్గం అదొక్కటే! అతను కాదంటే చేసేది ఏవీ లేదు. అయినా ప్రయత్నించడంలో తప్పులేదనిపించింది నేహాలకి.

పలురకాల ఆలోచన్ల మధ్య ఎప్పుడు నిద్రపట్టిందో తెలియలేదు.

మర్నాడు ఉదయం కిటికీ గుండా సూర్య కిరణాలు మొహమ్మీద పడగానే ఒక్కసారి ఉలిక్కిపడి లేచింది.

కానీ అప్పటికే తెల్లారి చాలా సేపయ్యిందని గ్రహించింది.

వసారా వైపు వచ్చేసరికి మసూం అక్కడే ఉన్నాడు. నిద్రలేచావా? అన్నట్లుగా చూసాడు.

"చెల్లెమ్మా! హసన్‌తో మాట్లాడాలన్న విషయం మౌల్వీకి విన్నవించాను. సిద్ధంగా ఉండు. మనకి ఎప్పుడైనా పిలుపు రావచ్చు," అని చెప్పాడు.

సరేనంటూ లోపలకి వెళ్ళింది. స్నానం చేసి వచ్చేశరికి సేవకులు అల్పాహారం సిద్ధం చేసారు. ఏదో తినాలని తింటోంది తప్ప దేని మీదా ధ్యాసే ఉండడం లేదు.

ఇంతలో హసన్ తాలూకు మనిషి వచ్చారంటూ మసూం చెప్పాడు.

వచ్చింది మెహజబీన్. ఒక్కతే వచ్చింది. వెనుక ఎవరూ రాలేదు.

మొట్టమొదట సారి నేహాలని చూసి ఆశ్చర్యపోయింది జబీన్. అంత అపురూప సౌందర్యవతిని ఆమె ఎప్పుడూ, ఎక్కడా ఇంతవరకూ చూడ లేదు. ఆమె అందం చూడగానే ఒక్కసారి అసూయ కలిగింది జబీన్‌కి. ఈమెతో వివాహం అయితే తనని హసన్ ఎట్టి పరిస్థితుల్లో పట్టించుకోడని అర్థమయ్యింది.

తను ప్రత్యేకంగా నేహాలతో మాట్లాడాలని వచ్చానని చెప్పింది మసూంకి.

నేహాల కేసి చూస్తూ - "నన్ను సుల్తాన్ హసన్ పంపారు. మీతో ప్రత్యేకంగా మాట్లాడాలి," అంటూ ప్రత్యేకమయిన యాసతో అంది. తన భాషలో చెబుతూన్నా ఉర్దూ మాట్లాడుతున్నట్లుగానే అనిపించింది నేహాలకి. ఆమె చెప్పింది అర్థమయ్యింది.

"సరే! నేనూ సుల్తాన్‌తో మాట్లాడాలని అనుకుంటున్నాను. ఇంతలో మీరు వచ్చారు," నమస్కరిస్తూ అంది నేహాల. జబీన్ ప్రతి నమస్కారం చెయ్యలేదు.

"మనిద్దరమే తప్ప ఎవరూ ఉండ కూడదు," చెప్పింది జబీన్.

ఇది విని మసూం అక్కడనుండి బయటకి వెళిపోయాడు. హరీంద్ర, భార్యా అక్కడే ఉన్నారు. వాళ్ళు కూడా ఉండకూడదన్నట్లు సైగ చేసింది జబీన్. అది చూసి వాళ్ళూ అక్కడనుండి నిష్క్రమించారు.

ఎలా మొదలు పెట్టాలో జబీన్‌కి అర్థం కాలేదు. నేహాల అందం చూస్తే మతిపోతోంది. ఎంతో తీక్షణంగా తనవైపే చూస్తున్న జబీన్‌ని ఉద్దేశించి నేహాలే అంది.

"మీరు మాట్లాడాలన్నారు."

"అవును. సుల్తాన్ మీ యోగక్షేమాలు చూడమని నన్ను పురమాయించారు. మీ పేరు?" నేహాలకేసే చూస్తూ అంది. పేరు చెప్పింది నేహాల.

"నాదొక చిన్న మనవి. మాకు ఇంతవరకూ మీ భాషలో ఒక్క ముక్కా అర్థం కాలేదు. మసూంకి మీ భాష వచ్చు కాబట్టి అతనే దుబాసీగా ఉంటున్నాడు. మీరు మా భాషలో మాట్లాడడం కాస్త తెరిపిగా ఉంది," మెల్లగా అంది నేహాల.

"ఈ గుల్బర్గాలో హిందువులూ ఉన్నారు. నా పరిచారికలతో మాట్లాడడం వల్ల మీ భాష వచ్చింది. అడగడం మర్చిపోయాను. మీ పేరు?" జబీన్ మొట్ట మొదటిసారి నవ్వుతూ అంది.

"నేహాల"

"మీ లాగే అందంగా ఉంది. మీ గురించి వివరాలు తెలిసాయి. హసన్, నేనూ కలిసే పెరిగాం. నాతో చాలా చనువుగా ఉంటాడు. మీరు అతనితో మాట్లాడాలని కబురు పంపినట్లుగా చెప్పాడు. మీకు...ఈ..నిఖా..." అంటూ ఒక్కసారి నేహాల మొహంలోకి చూస్తూ -గిపోయింది జబీన్.

అవున్నట్లుగా తలూపింది నేహాల. ఆశ్చర్యంగా చూసింది జబీన్.

"నా ఇష్టాయిష్టాలతో పని లేకుండా సుల్తాన్ ఈ వివాహం నిర్ణయించేసారు. కాదని పారిపోలేం. ఒక వేళ అలా చేసినా మమ్మల్ని బ్రతకనివ్వరు. ప్రజల మనసులతో ప్రభువులకి పనుండదు," నిరాశగా తలదించుకొని అంది నేహాల.

"చాలా ఆశ్చర్యంగా ఉంది. కాబోయే సుల్తాన్‌తో పెళ్ళంటే ఎవరైనా ఎంతో ఖుషీగా ఉంటారు. ఆప్ బిల్కుల్ అలగ్ హో! వేరే మతస్థులంటే భయమా?"

"మతం అంటే కాదు; మనుషులంటే భయం. మీరెలాగయినా సుల్తాన్ హసన్‌కి నచ్చ చెప్పగలరా? మేం మా వూరు ముద్గల్ వెళిపోతాం. దయచేసి..." కళ్ళ నీళ్ళు కారుతూండగా తుడుచుకుంటూ అంది నేహాల.

జబీన్‌కి ఏం చెప్పాలో అర్థం కాలేదు. తనకీ ఆమెకీ ఎంత వ్యత్యాసం? తనేమో ఎలాగయినా సుల్తానా కావాలని కలలుకంది. ఈ అమ్మాయి చూస్తే సుల్తానా కాకూడదని అనుకుంటోంది. ఎన్ని అవాంతరాలొచ్చినా సుల్తానా కావడమే తన ధ్యేయం. నేహాల్ని చూస్తే ఏం చెప్పాలో తెలియలేదు జబీన్‌కి.

అసలు ఎందుకు నేహాల ఇష్టపడడం లేదో అడిగింది జబీన్. జరిగినదంతా చెప్పింది నేహాల.

దేవరాయలు తనకోసం సైన్యం పంపిస్తే అది తప్పించుకొని రాయచూరులో తలదాచుకున్నాననీ, ఇంతలో తను ఇలా సుల్తాన్ చేతికి చిక్కినట్లుగా చెప్పింది. విషయం అర్థమయ్యింది జబీన్‌కి.

ఇది రెండు రాజ్యాలకి సంబంధించిన విషయం. పైగా మౌల్వీ గిసుదరాజ్ ఈ నిఖా ప్రతిపాదించాడంటేనే శ్చర్యంగా ఉంది. సుల్తాన్ ఫిరోజ్‌షాకి రాజకీయ లక్ష్యాలుండవచ్చు. కానీ గిసుదరాజుకి అలాంటివి లేవు.

"ఈ నిఖా మౌల్వీ గిసుదరాజ్ నిర్ణయించారని విన్నాను. సుల్తాన్ ఫిరోజ్‌షా ఒప్పుకున్నాక ఇది ఆగుతుందని అనుకోను. అయినా హసన్‌కి చెప్పి చూస్తాను. కానీ ఈ నిఖాని పడం ఎవరి తరమూ కాదని చెప్పగలను," అంటూ వెళ్ళడానికన్నట్లు లేచి నుంచుంది.

"మీరు సుల్తాన్ హసన్‌కి ఒకసారి చెప్పి...చూస్తారా?" మరోసారి అర్థించింది నేహల.

"మీకు ఏ కావాలన్నా కబురుపంపండి. ఏర్పాట్లు చేయించే ప్రయత్నం చేస్తాను. మీరు అనవసరంగా దిగులు పెట్టుకోకకండి," అని చెప్పి బయల్దేరింది.

"మీ పేరు తెలుసుకోవచ్చా?" వెళుతూండగా జబీన్‌ని అడిగింది నేహల.

పేరు చెప్పి వెళ్ళొస్తానని చెప్పి వెళిపోయింది జబీన్.

జబీన్‌తో జరిగిన సంభాషణ పూర్తిగా మసూంకి, తల్లి తండ్రులకీ చెప్పింది.

జబీన్ మీద తనకి ఆశ చాలా తక్కువని వాళ్ళకి చెప్పింది.

ఆమె వెళ్ళాక ఏం చేస్తే ఇక్కడనుండి బయటకు వెళ్ళగలమని మసూంని అడిగింది నేహల.

"నాకు తెలిసి చాలా కష్టం. ఒక్క సుల్తాన్ హసన్ కాదంటే తప్ప ఈ పెళ్ళి ఆగదు. అతను ఈ పెళ్ళికి సుముఖంగానే ఉన్నాడు కనక, అదీ తప్పిపోయింది," అంటూ తన మనసులో మాట చెప్పాడు మసూం.

"మసూం! ఒక్కసారి నువ్వు ఊర్లోకి వెళ్ళి రేవన్న గురించి వాకబు చేస్తావా? అతనికి ఇక్కడ జరిగినదంతా చెప్పగలవా?" అడిగింది నేహల.

"అలాగే! ఈ పెళ్ళి విషయం తేలేవరకూ నన్నూ ఈ కోట దాటి బయటకు పంపరనే అనుకుంటున్నాను. అయినా ప్రయత్నిస్తాను. సుల్తాన్ అహ్మద్‌ఖాన్ ద్వారా ప్రయత్నిస్తాను. చూద్దాం, " అన్నాడు మసూం.

ఇహ సంభాషణలు పొడిగించలేదు ఎవరూ. ఏం చెయ్యాలో తెలియని పరిస్థితి.

0000000000000

మసూం కోట బయటకు వెళ్ళడానికి ఎవరూ అనుమతించలేదు. అహ్మద్‌ఖాన్ ఎదురుపడినప్పుడు అడిగి చూసాడు. నిఖా అయ్యే వరకూ బయటకు పంపవద్దని ఫిరోజ్‌షా ఆజ్ఞ అని చెప్పాడు.

ప్రతీ క్షణమూ భారంగా గడుస్తోంది వాళ్ళకి. ఒక్కొకరూ వచ్చి ఏం చెయ్యాలో చెప్పి వెళిపోతున్నారు.

నేహలకి పదే పదే రేవన్నే గుర్తుకొస్తున్నాడు. తనకోసం ప్రాణాలు సైతం లెక్కపెట్టకుండా ఇన్నాళ్ళూ తనవద్దే ఉన్నాడు. అలాంటిది ఇప్పుడెక్కడున్నాడో? అసలు విషయం తెలియక ఏం మథన పడుతున్నాడో అనుకుంది నేహల. ఈ సారి గిసుదరాజ్ వచ్చినప్పుడు రేవన్నని తమతో పాటు ఉండేలా చూడమని అడగాలి అనుకుంది.

కానీ తన కళ్ళముందే తన వేరొకరికి భార్య కావడం చూస్తూ భరించగలడా?

తనకే ఇంత మనోవేదన ఉంటే, రేవన్నకెలా ఉంటుందో ఊహించగలదు నేహల.

000000000

మర్నాడు ఫిరోజ్‌షా రమ్మన్నాడని కబురొచ్చింది.

నేహలా తల్లితండ్రులూ వెళ్ళారు. మసూం కూడా వెళ్ళాడు. అక్కడ గిసుదరాజ్ మాత్రం లేడు. అహ్మద్‌ఖాన్, హసన్ మాత్రం వున్నారు. ఫిరోజ్‌షా పక్కనే ఒకామె ఉంది. రంగుల ముసుగులో ఆమె ముఖం స్పష్టంగా కనిపించడం లేదు.

సుల్తాన్ హసన్‌తో నిఖా వచ్చే పౌర్ణమికి ఖాయం చేసామని చెప్పారు. అంతవరకూ తమ నివాసం దాటి వెళ్ళకూడదన్న విషయాన్నీ చెప్పారు. నేహలకి తలదించుకునే వింది. ఇంతవరకూ ఆమె హసన్‌కేసి కూడా చూడ లేదు. జబీన్‌తో మాట్లాడాలని పంపిన కబురుకి ఇంతవరకూ సమాధానం లేదు.

ఇహ ఈ పెళ్ళికి తలవంచడం మించి గత్యంతరంలేదని అర్థమయ్యింది. అన్నీ నిస్తేజంగా వింది.

వెళుతూండగా - హసన్ మసూంతో ఏదో అన్నాడు.

హసన్‌తో మాట్లాడాలని కబురు పంపిన సంగతి చెప్పాడు మసూం. ఇహ అవసరం లేదన్నట్లు తలూపి ముందుకునడిచింది నేహల.

తనే వీలు చూసుకొని వస్తానని చెప్పమన్నట్లుగా చెప్పాడు హసన్. మసూం చెప్పింది వింది నేహల.

ప్రస్తుతం అదొక్కటే అప్రయత్నంగా జరిగిపోతింది. శరీరంలో ఇంద్రియాలన్నీ ఆధీనంలో ఉండడం లేదు. జీవితమూ అంతే!

0000000000000

అనాడు సాయంత్రం మందీ మార్బలంతో ఒకామె వచ్చింది. చూడ్డానికి తన వయస్కురాలులాగే కనిపించింది నేహలకి. చాలామంది స్త్రీలు కూడా వచ్చారు. వస్తూ అనేక కానుకలూ, వస్త్రాలూ, నగలూ అన్నీ పట్టుకొచ్చారు.

ఇంతవరకూ నేహల ఏ రకమయిన అలంకరణా చేసుకోలేదు. అసలు దానిమీదే ధ్యాస లేదు.

ఆ వచ్చినామె సుల్తానా అని మాత్రం అర్థమయ్యింది. ఎవరి సుల్తానాయో తెలియదు. ప్రస్తుతం గిసుదరాజ్, ఫిరోజ్‌ఖాన్‌లను మాత్రమే గుర్తించగలదు నేహల. మిగతా ఎవరినీ తలెత్తి చూడ లేదు, హసన్‌తో సహా!

ఏ ధ్యాసలో ఉందో నేహల సుల్తానాకి నమస్కరించలేదు.

అంతే ఆ వచ్చిన చిన్న సుల్తానాకి చిర్రెత్తుకొచ్చింది.

తలదించుకొని అక్కడే నుంచున్న నేహల దగ్గరకొచ్చింది.

"నువ్వేనా నేహల? సుల్తానాకి గౌరవం ఇవ్వాలని కూడా తెలియదా? ఎంత పొగరు?" కోపంగా అంది. ఒక్కసారి తలెత్తి చూసింది నేహల.

వచ్చినామె రాణీ వాసపు స్త్రీ అని తెలుసుకానీ, ఎవరి సుల్తానాయో తెలియ లేదు. పైగా స్పష్టంగా తన భాషలో చెప్పేసరికి ఆశ్చర్యపోయింది నేహల.

సుల్తానా మొహమ్మీద ముసుగు పక్కకు తొలగించింది.

"మీరు ఎవరో నాకు తెలియ లేదు. క్షమించండి," మెల్లగా అంది నేహల.

వంటినిండా ఆభరణాలూ, మెరుపు జరీ దుస్తులతో జిగేల్ మంటూ ఉందా సుల్తానా.

"నేను సుల్తాన్ ఫిరోజ్‌షా మూడో సుల్తానాని. ఇంకా గట్టిగా చెప్పాలంటే విజయనగర సామ్రాజ్యాధిపతి దేవరాయల కూతుర్ని. ఇప్పటికయినా తెలిసిందా?" గట్టిగా ఉరిమింది సుల్తానా.

ఆమె దేవరాయల కుమార్తె మంజరి అని అర్థమయ్యింది నేహలకి. ఏవీ సమాధానం చెప్పలేదు. పక్కనే తల్లీ తండ్రీ కూడా మౌనంగానే చూస్తున్నారు.

"నీ వల్లే మా విజయనగరానికి శని దాపురించింది. ఆ వేదరాయశర్మ చేసిన నిర్వాకానికి యావత్తు విజయనగరమూ సంకట పరిస్థితుల్లో పడింది. ఇంకా గట్టిగా చెప్పాలంటే నీ వల్లే నేను ఇక్కడ చిక్కుకుపోయాను. సౌందర్యం రూపంలో ఉన్న శనిదేవతవు నువ్వు. అర్థమయ్యిందా?" పళ్ళు పటపటా కొరుకుతూ అంది.

"ఈ రూపంలో ఉండడం నా తప్పా? నేనేమీ మీ తండ్రిగారి వెంట పడలేదు. ఇంకా చెప్పాలంటే వేదరాయశర్మ గారినీ నేను ప్రాధేయపడలేదు. ఆయన ఏదో చెబితే పెళ్ళాడలన్న మిషతో మహారాజు మా వూరికి సైన్యాన్ని పంపించాడు. ఆ వచ్చిన నరేంద్ర గజపతి ముద్గల్‌ని ధ్వంసం చేసాడు. మా బ్రతుకులన్నీ కాలరాసాడు. వాళ్ళ దౌర్జన్యాలు తప్పించుకొని ఎలాగా బ్రతికి బయటపడ్డాం అనుకూంటూండగా, ఇదిగో ఈ గుల్బర్గాలో చిక్కుకున్నాం. మాకు నచ్చినట్లు మేము జీవించే హక్కు లేదా?" ఒక్క సారి దుఃఖం పెల్లుబికింది నేహలకి.

ఇది విని సుల్తాన్ మంజరి ఒక్కసారి విస్మయంతో చూసింది.

"ఏవిటి చెబుతున్నావు? మా తండ్రి నిన్ను పెళ్ళాడాలన్న విషయం తెలుసు. కానీ సైన్యాన్ని పంపాడన్నది మాకు తెలియదు. నరేంద్ర గజపతి ముద్గల్లుపై దాడి చేసాడా? ఇవేమీ మాకు తెలియవు," అంటూ ఆశ్చర్యపోయింది.

నేహల మెల్లగా జరిగినదంతా చెప్పింది. మంజరికి అప్పుడు పూర్తిగా అర్థమయ్యింది. తన తండ్రి చేసిన నిర్వాకానికి విజయనగరం సమస్యల్లో చిక్కుకుంది. తద్వారా యుద్ధం వచ్చింది. దాన్నుండి తప్పించుకోవడానికి తనని పణంగా పెట్టాడు తండ్రి.

కానీ ఈ నరేంద్ర గజపతి విధ్వంసం సంగతి విజయనగరం రాణి వాసాన్ని చేరలేదు. బహుశా ఇదంతా ఉమాదేవి కుట్ర కాబోలును. అందుకే నరేంద్ర గజపతి ఈ అరాచకం చేసాడు. ఒక్కో విషయం అర్థమయ్యింది మంజరికి.

"నరేంద్రగజపతి చేసిన దుశ్చర్యలకి మనమందరం బలయ్యాం. అతను నాపైన కూడా కన్నేసాడు. అదృష్టవశాత్తూ అతని బారిన పడ లేదు నేను," అంది సుల్తాన్ మంజరి.

" నరేంద్ర గజపతి ప్రస్తుతం సుల్తాన్ ఫిరోజ్‌షా బందీగా ఉన్నాడు. మీకు తెలియదా?" పక్కనే ఉన్న హరీంద్ర చెప్పాడు.

నరేంద్రగజపతి ఇచ్చిన సమాచారం వల్లనే తమ ఉనికిని మసూం ద్వారా సుల్తాన్ ఫిరోజ్‌షా తెచ్చుకున్నాడన్న విషయమూ చెప్పాడు.

నరేంద్రగజపతి గుల్బర్గా సుల్తాన్ చేతిలో బందీ అన్న విషయం తనకింత వరకూ తెలియనందుకు మరోసారి ఆశ్చర్యపోయింది మంజరి.

"నరేంద్ర గజపతి ఇక్కడే ఉన్న విషయం నాకు తెలియదు. అతనెలా వచ్చాడు? ఎందుకొచ్చాడు? ఏవీ అర్థం కావడం లేదు," మంజరి మనసులో మాట పైకి అనేసింది.

అక్కడే ఉన్న మసూం మిగతా వివరాలు చెప్పాడు.

"నేహలా! నేనూ, నువ్వూ ఒకే వయస్సు వాళ్ళం. మా నాన్న రాజ్యాన్ని రక్షించడంకోసమంటూ నన్ను బలి చేసాడు. వ్యసనాలకి దాసుడైన కొడుకుని దారిలోకి తెచ్చుకోవడానికి నిన్ను బలిచేస్తున్నారు ఈ సుల్తాన్! నీ గురించి ముందు తెలుసుంటే ఈ పెళ్ళి పె ప్రయత్నం చేసేదాన్ని. ఇప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. అందరికీ నిఖా ఆహ్వాన పత్రాలు కూడా వెళిపోయాయి. పైగా గిసుదరాజ్ ఈ పెళ్ళిని నిర్వహిస్తున్నాడంటే దాన్ని ఆపడానికెవరూ సాహసించరు, సుల్తాన్ ఫిరోజ్‌షాతో సహా. అయినా ప్రయత్నిస్తాను. నీకేం కావాలన్నా

నాకు కబురు పంపించు. నీదీ మా రాజ్యమే కాబట్టి, నేను నిన్ను అనునయించడానికని పంపించాడు సుల్తాన్! లేకపోతే మనం నిఖాలోనే కలిసే వాళ్ళం," నేహాల చేతులు పట్టుకుంటూ అంది.

మంజరి చివర్లో మాట్లాడిన విధానం చూసి తనకొక్క రాజీ రాలు దొరికిందన్న అభిప్రాయం వచ్చింది నేహాలకి. కనీసం తన మాటని అర్థం చేసుకోగల మనిషి ఈ గుల్బర్గా కోటలో ఎదురవ్వడం కాస్త ఉపశమనాన్ని కలిగించింది.

కొంత సేపు మరిన్ని వివరాలు రాబట్టుకొని అక్కడనుండి కదిలింది మంజరి.

వెళుతూ భరణాలు, జరీ చీరలూ, కానుకలూ నేహాలకోసమేనని చెప్పింది.

ప్రస్తుతం నేహాల పెళ్ళి కన్నా, నరేంద్ర గజపతి సంగతి చూడాలన్నదే ఆమె ధ్యేయం. సుల్తాన్ ఫిరోజ్‌షా రాత్రి తన మందిరానికి వచ్చినప్పుడు ఏం అడగాలో ఆమెకు తెలిసింది.

నేహాల ఆశలన్నీ మంజరిపైనే ఉన్నాయి. ఈ నిఖా ఆగాలంటే ఒక్క మంజరి వల్లే సాధ్యం అని నమ్ముతోంది.

మంజరి ద్వారా రేవన్నని ఇక్కడికి రప్పించాలన్న ఆలోచన కొత్తగా మెదిలింది నేహాలకి.

మంజరి వెళ్ళాక రేవన్న గురించే ఆలోచిస్తూ ఉంది.

ఒక్కసారి రేవన్నని చూడాలి. తను ఈ పెళ్ళిని తప్పించుకోలేదు.

కానీ పెళ్ళికి ముందు ఒక్కసారి కలవాలి. ఇదొక్కటే తనకున్న కోరిక.

ప్రస్తుతం నేహాలకున్న ఒకే ఒక ఆసరా మంజరి.

000000000000000

*00000000000*

**(కొనసాగింపు వచ్చేసంచికలో)**

Click here to share your comments on this serial